

విద్యార్థుల ప్రదర్శనలు



వేడుకలు తిలకిస్తున్న స్థానికులు, అతిథులు

# సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ప్రజా సంక్షేమమే ధ్యేయం
- రూ.273.83 కోట్ల పంట రుణాలు మాఫీ
- ఇందిరా జీవిత బీమాతో మహిళలకు భీమా
- టాస్క్ సెంటర్‌తో యువతకు నైపుణ్యాభివృద్ధి
- డ్రగ్స్ మహమ్మారిని జిల్లానుంచి తరిమేద్దాం
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద
- కలెక్టరేట్‌లో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం



గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్య అతిథి నేరెళ్ల శారద



ఆకట్టుకున్న విద్యార్థిని వేషధారణ

మాట్లాడుతున్న నేరెళ్ల శారద

వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యార్థిని సాంస్కృతిక ప్రదర్శన

త్రివర్ణ పతాకం ఆవిష్కరిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీపీ చేతన

సాక్షి, పెద్దపల్లి: సమగ్రాభివృద్ధి లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. ప్రజాపాలన ద్వారా అర్హులైన ప్రతీకుటుంబానికి గ్యారంటీ పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆమె ప్రసంగంలో ప్రధానాంశాలు ఇవి..

**రూ.273.82కోట్ల రుణమాఫీ**

- జిల్లాలో ఇప్పటివరకు 43,125మంది రైతులకు రూ.273.82కోట్ల పంట రుణాలు మాఫీ చేశాం. బీమా పథకంతో రైతుల తరపున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించింది. ప్రతీ పంటకు బీమా సౌకర్యం కల్పిస్తోంది. 1976 ఎకరాల విస్తీర్ణంలో కొత్తగా ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నాం.

**మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలతో ..**

- ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు రూ.1.31కోట్లకుపైగా జీరోటికెట్లను జారీచేశాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ ద్వారా 1,59,743 సిలిండర్లకు రాయితీ వర్తింపజేశాం. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.4.77కోట్ల వరకు ఈ సొమ్ము జమచేశాం. 200యూనిట్ల ఉచిత పథకం ద్వారా 5,36,304 జీరో బిల్లులు జారీచేశాం. విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.21.69 కోట్లు చెల్లించాం.

**మహిళలకు ప్రమాద బీమా**

- ఇందిరా జీవిత బీమా పథకం ద్వారా మహిళా సంఘాల్లోని సభ్యులకు రూ.10లక్షల చొప్పున ప్రమాద బీమా వర్తింపజేస్తున్నాం. ఇందిరా మ హిళా శక్తి ద్వారా 30 స్టిచ్చింగ్ కేంద్రాలు ఏర్పా టు చేశాం. పాఠశాల విద్యార్థులకు యూనిఫా మ్స్ కుట్టించాం. 4 అమ్మ క్యాంటీన్‌లు, 12 రకా ల వ్యాపార, వాణిజ్య యూనిట్లు నెలకొల్లేందు కు ప్రణాళిక రూపొందిస్తున్నాం. రామగుండంలోని సింగరేణి వైద్య కళాశాలలో రూ.142 కోట్ల వ్యయంతో 355 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాం. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత రెసిడెన్షియల్ గురుకులు నిర్మిస్తాం.

**టాస్క్‌తో నైపుణ్యాభివృద్ధి**

- యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించి ప్రపంచస్థాయి పోటీలకు సన్నద్ధం చేసేందుకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన టాస్క్ సెంటర్ ఏర్పాటు చేశాం. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని ప్రజాప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పోరాటానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకరించాలి.



వేడుకల్లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కలెక్టర్ శ్రీహర్ష, డీసీపీ చేతన

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

- చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెద్దపల్లి మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థులు.. దేశ్ దేశ్ కీ రంగీలా, గాయత్రి స్కూల్ విద్యార్థులు .. మేరా భారత్ కో సలాం, జెడ్పీ హైస్కూల్(బాలికలు) .. ఇదే మన భారతం, కాకతీయ అరబిందో స్కూల్ విద్యార్థులు.. ఇండియా వాలే, కాల్వశ్రీరాంపూర్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థులు.. జగతి సిగల్‌లో జాబిలమ్మ గేయాలపై చేపట్టిన ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన 140 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అయితే, ఉక్కపోతతో అతిథులు ఉక్కిరిబిక్కిరయ్యారు.

**రూ.51.30కోట్ల చెక్కుల పంపిణీ**

- ఇందిరా మహిళాశక్తిలో భాగంగా చైతన్యజ్యోతి మహిళా సమాఖ్య పరిధిలోని 433 సంఘాలకు రూ.45,14,80,000 విలువైన బ్యాంకు లింకేజీ రుణం చెక్కును నేరెళ్ల శారద అందించారు. అలాగే 48 మెప్మా సంఘాలకు రూ.5.23కోట్ల విలువైన రుణాలు పంపిణీ చేశారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా 58 కుటీర పరిశ్రమల ఏర్పాటుకు రూ.92.50 లక్షల రుణాన్ని అందజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా గ్రామీణ అభివద్ధి శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను శారద తిలకించారు. ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లాస్థాయిలో ఎంపికైన 9 వినూత్న ఆవిష్కరణలను పరిశీలించి ఆవిష్కర్తలను ప్రశంసించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి హేమంత్‌కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్, డీసీపీ చేతన, ఆర్డీవో గంగయ్య, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన ప్రతినిధులు, స్థానికులు, అతిథులు తదితరులు



పెద్దపల్లి కలెక్టరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు బలగాల కవాతు

## అలరించిన ప్రదర్శనలు.. ఆకట్టుకున్న స్టాళ్లు

పెద్దపల్లిరూరల్: స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. అతిథులు వాటిని తిలకించి అబ్బురపడ్డారు.

### ఆకట్టుకున్న స్టాళ్లు..

వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ శ్రీహర్ష తదితరులు స్టాళ్లను పరిశీలించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటింటా ఇన్నోవేటర్ ద్వారా జిల్లాస్థాయిలో ఎంపికైన 9 ఆవిష్కరణలు ప్రశంసలందుకున్నాయి.





### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. ప్రదర్శనలను ముఖ్య అతిథి నేరెళ్ల శారదతోపాటు ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ చేతన తదితరులు తిలకించారు.

## విద్యుత్ పంపిణీలో అగ్రస్థానం

ధర్మారం(ధర్మపురి): ఎన్పీడీసీఎల్ జూన్–జూలై నెలలకు ప్రకటించిన ర్యాంకింగ్‌లో 16 జిల్లాల పరిధిలోని డిస్కం స్థాయిలో ధర్మారం విద్యుత్ సబ్ డివిజన్ మొదటి ర్యాంక్ సాధించింది. దీంతో సబ్ డివిజన్ ఏఈ ఖాసీం గురువారం ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ద్వారా సర్టిఫికెట్ అందుకున్నారు. హన్మకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో సర్టిఫికెట్‌తోపాటు జ్ఞాపికను ఏఈ ఖాసీంకు సీఎండీ అందజేశారు. కాగా, ధర్మారం సబ్ డివిజన్‌కు వరుసగా మూడుసార్లు ర్యాంక్‌లు రావడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఏడీఈ కనుకయ్య, ఏఈలు ఖాసీం, సురేశ్, అశోక్‌కు ప్రశంసాపత్రాలతోపాటు జ్ఞాపికలను సీఎండీ అందించి అభినందించారు.



ర్యాంక్ సర్టిఫికెట్ అందుకుంటున్న ఏఈ ఖాసీం

## న్యూస్‌రీల్

### మంత్రికి ఆహ్వానపత్రిక



ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈవో కాంతరెడ్డి

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీఆదివరాహస్వామి జయంతి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమవుతున్నాయి. ఈ ఉత్సవాలను హాజరు కావాలని కోరుతూ ఆలయ ఈవో కాంతరెడ్డి, పూజారి ప్రసాదచార్యులు గురువారం ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. వారివెంట నాయకుడు ఇనగంటి రామారావు ఉన్నారు.

### మువ్వన్నెల జెండా రెపరెపలు



జెండా ఎగురవేస్తున్న ఆర్డీవో హనుమనాయక్

మంథని: డివిజన్‌లో గురువారం స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గడపగడపకూ మువ్వన్నెల జెండా రెపరెపలాడాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పెండ్రు రమ జాతీయ జెండా ఎగురవేశారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో హనుమా నాయక్, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ రాజయ్య, సింగిల్‌విండో కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, అలాగే పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలల్లో జెండాలు ఆవిష్కరించారు. కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు మువ్వన్నెల జెండాలు ఎగురవేశారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### కమిషనరేట్‌లో వేడుకలు



జెండా ఎగురవేస్తున్న డీసీపీ రాజు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో గురువారం స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడ్మిన్ డీసీపీ సి.రాజు జాతీయ జెండా ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ రమేశ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ సీఐలు పాల్గొన్నారు.

### ఇంటిపై జెండావిష్కరణ

పెద్దపల్లిరూరల్: తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి చాటుకున్నారు తండ్రీ కొడుకులు. తుర్కల మద్దికుంట గ్రామంలో ముత్యాల రాజయ్య తన కొడుకుతో కలిసి తమ ఇంటిపైనే జాతీయ జెండాను గురువారం ఆవిష్కరించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.



దేశభక్తి చాటుకున్న తండ్రీకొడుకులు

### ఆర్ఎఫ్‌సీఎల్‌లో వేడుకలు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో స్వాతంత్య్ర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్ జాతీయ పతాకం ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి చేసిన యూరియా తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, కార్మికులకు కమాండబుల్ అవార్డులు అందించారు.



జెండా ఆవిష్కరిస్తున్న అలోక్ సింఘాల్

### రేపు ఓరియెంటేషన్ కార్యక్రమం

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల మానసిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు ఈనెల 17న ఓరియంటేషన్, మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేశ్ గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి, మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వర్‌రావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి డీసీపీ చేతన, డీఈవో మాధవి హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

## దేశానికే ఆదర్శం సింగరేణి

- ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు ఉద్యోగుల సంక్షేమంలో సింగరేణి బొగ్గు గనుల సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన మాట్లాడారు. గతేడాది 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, ఈసారి 72మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించామన్నారు. మార్కెట్‌లోని డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి పెంచి వ్యయం తగ్గించుకోవాలని అన్నారు. ఉత్పత్తి లక్ష్య సాధనలో జీడీకే–5 ఓసీపీ ముందంజలో ఉందని, ఇదేస్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం రూ.35కోట్లతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా కార్మిక కుటుంబాలకు రక్షిత మంచినీరు అందిస్తామన్నారు. సేవా అధ్యక్షురాలు అనిత, ఏఐటీయూసీ నేత మడ్డి ఎల్లయ్య, సేఫ్టీ జీఎం గుప్తా, క్వాలిటీ జీఎం కేవీ రావు, సేఫ్టీ అధికారి భైద్యా, సీఎంవోఏఐ నాయకుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల ప్రదర్శనలు

**అనేమంది త్యాగఫలితమే..**

అనేకమంది నేతల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందని ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ అన్నారు. సీఈఆర్ క్లబ్‌లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన మాట్లాడారు. పరిసర, ప్రభావిత గ్రామాల మహిళలు, యువత అభ్యున్నతికి పాటుపడుతోందని అన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్, అధికారుల సంఘం అధ్యక్షులు, మధుసూదన్, ఎస్వోటూ జీఎం వెంకటేశ్వర్‌రావ్, ఏరియా ఇంజినీర్ నరసింహరావ్, రక్షణ అధికారి సంతోష్‌కుమార్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 31,560 మంది రైతులు.. రూ.552.19 కోట్లు

- మూడో విడత రుణమాఫీ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాతాల్లో జమ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం మూడో విడత రుణమాఫీకి గురువారం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రూ.2 లక్షలలోపు రుణం ఉన్న 31,560 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. వీరికి సంబంధించిన 41,777 ఖాతాల్లో మొత్తం రూ.552.19 కోట్లను జమచేసే ప్రక్రియను ప్రారంభించింది.

**మూడు విడతల్లో... రూ.1843.19 కోట్లు**

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టోలో రూ.2 లక్షల లోపు రుణం మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఆగస్టు 15లోపు మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ప్రకటించారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు కాలపరిమితి (కటాఫ్)గా నిర్దేశించారు. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలను జూలై 18న మాఫీ చేసింది. మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలో 12,8,762 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ. 710.29 కోట్లు జమచేసింది. జూలై 30న రెండో విడతలో రూ.లక్షన్నరలోపు రుణాలు ఉన్న 63,286 మంది ఖాతాల్లో రూ. 580.71 కోట్లు మాఫీ చేసింది. మూడో విడతలో రూ.2లక్షల లోపు రుణాలు ఉన్న 41,777 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.552.19 కోట్లు మాఫీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. మొత్తంగా మూడు విడతల్లో కలిపి 2,33,824 ఖాతాల్లో రూ. 1843.19 కోట్ల పంట రుణాలను మాఫీ చేసింది.



**కొర్రీలతో మాఫీకాక అవస్థలు**

మూడు విడతల్లో రుణ మాఫీ చేసిన, చాలా మంది రైతుల పేర్లు మాఫీ జాబితాలో లేకపోవడంతో వారందరూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు ఖాతాలో ఒక పేరు, ఆధార్‌లో మరోపేరు, రేషన్ కార్డు లేక, వడ్డీ ఎక్కువ అయ్యి.. ఇలా దాదాపు 32 కారణాలతో పలువురు రైతులకు మాఫీ కాక ఇబ్బందులు తలెత్తాయి. ఆయా జిల్లాలో రైతులకు ఏవైనా సందేహాలు, సమస్యలు తలెత్తితే నివృత్తి, పరిష్కారం చేసేందుకు మండలాలవారీగా ఏవో, ఏఈవోలను సంప్రదించవచ్చని, ప్రత్యేకంగా రిజిస్టర్ నిర్వహిస్తూ సమస్య పరిష్కరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

**జిల్లాల వారీగా మాఫీ వివరాలు**

| | మొదటి విడత | | రెండో విడత | | మూడోవిడత | |
|---|---|---|---|---|---|---|
| జిల్లా | ఖాతాలు | మాఫీ (రూ.కోట్లలో) | ఖాతాలు | మాఫీ (రూ.కోట్లలో) | ఖాతాలు | మాఫీ (రూ.కోట్లలో) |
| కరీంనగర్ | 36,023 | 186.39 | 18,510 | 173.28 | 12,034 | 152.65 |
| జగిత్యాల | 39,229 | 207.00 | 19,623 | 169.00 | 13,799 | 172.34 |
| పెద్దపల్లి | 29,724 | 149.42 | 13,238 | 122.43 | 8,268 | 101.75 |
| సిరిసిల్ల | 23,785 | 167.48 | 11,915 | 116.00 | 7,676 | 125.45 |
| మొత్తం | 1,28,761 | 710.29 | 63,286 | 580.71 | 41,777 | 552.19 |

## క్లుప్తంగా

### విద్యార్థులకు అభినందనలు



బహుమతి అందిస్తున్న మంత్రి సంజయ్

మంథని: జాతీయ కరాటే పోటీల్లో పాల్గొనేందుకు హరియాణా వెళ్లిన పట్టణానికి చెందిన కరాటే విద్యార్థులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభినందించారు. విద్యార్థులు మొట్టు హాసిని, బండారి మణికంఠకు ఆయన జ్ఞాపికలు అందించారు.

### ఢిల్లీ వేడుకల్లో జిల్లా విద్యార్థులు



త్రివర్ణ పతాకంతో విద్యార్థులు

ఓదెల(పెద్దపల్లి): దేశరాజధాని ఢిల్లీలో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎర్రకోటలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతీయజెండా ఎగురవేసిన, ప్రసంగాన్ని ఓదెల మోడల్ విద్యార్థి పర్ష అభిజ్ఞ, పెద్దపల్లి మండలం అప్పన్నపేట హైస్కూల్ విద్యార్థి మహ్మద్ అల్తీషాహన్, టీచర్ సుజాత తిలకించారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన పలువురు విద్యార్థులతో కలిసి ప్రధానితో కరచాలనం చేశారు. సాయంత్రం 6 గంటలకు కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ ప్రసంగ కార్యక్రమానికీ హాజరయ్యారు. శుక్రవారం జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నాక వారు శనివారం జిల్లాకు చేరుకుంటారు.

### ఇసుక లారీ పట్టివేత



పట్టుబడిన ఇసుక లారీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని గురువారం తెల్లవారుజామున నర్సయ్యపల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు లారీని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వికారాబాద్‌కు చెందిన లారీ ఓనర్ ముదావత్ లక్ష్మణ్, డ్రైవర్ శంకర్‌ప్పాపై కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే దానిపై విచారణ చేపట్టామని వివరించారు. కాగా ఎలిగేడు మండలం లలితపల్లి నుంచి డంపు చేసిన ఇసుకను రాత్రుల్లో అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముత్తారం(మంథని): పారుపల్లికి చెందిన తగరపు వినోద్ కుమార్(19) కరీంనగర్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తగరపు లింగయ్య – లక్ష్మి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కౌలు చేసుకునే లింగయ్య.. పిల్లల పెళ్లిలు, వ్యవసాయం కోసం రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తన తండ్రి చేసిన అప్పు ఎలా తీరుతుందనే మనస్తాపంతో వినోద్‌కుమార్ జూలై 7న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి తండ్రి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పెద్దపల్లి ఆర్డీవో బి.గంగయ్య, వేదికపై కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, పెద్దపల్లి డీసీపీ చేతన, ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లా జడ్జి హేమంత్‌కుమార్ తదితరులు



లింగమూర్తి, సీఐ, జీడీకే - టూ టౌన్ | ప్రసాద్‌రావు, సీఐ, జీడీకే - టూ టౌన్ | సుబ్బారెడ్డి, సీఐ, సుల్తానాబాద్ | టి.ప్రవీణ్, సీఐ, రామగుండం



ఆర్.స్వామి, ఎస్సై, బసంత్‌నగర్ | వెంకటేశ్, ఎస్సై, జీడీకే - టూ టౌన్ | వెంకట్, ఎస్సై, అంతర్గాం | ఓంకార్ యాదవ్, ఎస్సై, కాల్వశ్రీరాంపూర్

## ప్రతిభకు ప్రశంసలు

విధి నిర్వహణలో చూపిన ప్రతిభను గుర్తించిన జిల్లా యంత్రాంగం అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందజేసి అభినందించింది. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసించింది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ప్రతాప్, ఏసీపీ(ఏఆర్) | ఎం.రమేశ్, ఏసీపీ, గోదావరిఖని | వెంకటేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్



ఆదిరెడ్డి, డీఏవో | జి.కృష్ణ, ఏసీపీ, పెద్దపల్లి | శ్రవణ్‌కుమార్, ఎస్సై, సుల్తానాబాద్ | ఎస్.లక్ష్మణ్, ఎస్సై, ధర్మారం



బి.సమ్మయ్య, ఎస్సై, రామగుండం | కె.సతీశ్, ఎస్సై, ఎన్టీపీసీ | అశోక్‌రెడ్డి, ఎస్సై, పొత్కపల్లి | జీవన్‌రెడ్డి, ఎస్సై, ఎక్స్రైజ్ | ఎన్.శ్రీధర్, ఎస్సై, జూలపల్లి | బి.రాజు, సీఐ, మంథని | ఇంద్రసేనారెడ్డి, సీఐ, జీడీకే -1టౌన్ | సోనికిరణ్, ఎఫ్ఎస్‌వో | నాగయ్య, ఎఫ్ఆర్‌వో | శారద, మహిళా ఏఎస్సై, జీడీకే-2టౌన్



నరేశ్, జేఏవో, మంథని | రవీందర్, సివిల్ సర్జన్ | సాయి ప్రసాద్, సివిల్ సర్జన్ | సాగర్, సీసీ టు ఏసీ(ఎల్‌బీ) | రాజేంద్రప్రసాద్, సీసీ టు ఏసీ(ఆర్) | రామచందర్‌రావు, తహసీల్దార్, రామగిరి | గిరీశ్‌బాబు, ఈఈ, పీఆర్ | నరేందర్, జెడ్పీ సీఈవో | శివయ్య, డీఎఫ్‌వో | రవీందర్, డీఆర్‌డీవో



శంకరయ్య, ఈవో, ఎండోమెంట్ | బి.శ్రీనివాస్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ | ఎం.శ్రీకాంత్, డీఎంసీఎస్ | శశికళ, ఎంపీడీవో, పాలకుర్తి | కవిత, సీడీపీవో | శ్రీకాంత్, కమిషనర్ రామగుండం కార్పొరేషన్ | దివ్యదర్శన్‌రావు, ఎంపీడీవో, సుల్తానాబాద్ | ఎ.విజయ్‌కుమార్, ఇంటలిజెన్స్ | రాంమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ | వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, పెద్దపల్లి

# కార్మికుడి ఆత్మహత్యాయత్నం

- జాతీయజెండా సాక్షిగా ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వైనం
- మేయర్ ఉపన్యాసం చేస్తున్న సమయంలో ఘటన
- అడ్డుకున్న బల్దియా సిబ్బంది
- అధికారుల తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం



బాధితుడి ఒంటిపై పడిన పెట్రోల్‌ను నీళ్లుపోసి తుడిపేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా జంగిపెల్లి విజయ్‌కుమార్ అనే పారిశుధ్య విభాగం తాత్కాలిక కార్మికుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతుండగా.. తన ఆవేదనను పట్టించుకోండంటూ విజయ్‌కుమార్ తన ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. జేబులోంచి అగ్గిపెట్టె తీసి వెలిగిస్తుండగా అక్కడే ఉన్న కార్పొరేటర్ మహంకాళి స్వామితోపాటు ఉద్యోగులు, సిబ్బంది వెంటనే అడ్డుకున్నారు. ఈ ఘటనతో ఖంగుతిన్న మేయర్, కమిషనర్ ఆందోళనకు గురయ్యారు. బాధితుడిని సముదాయించారు.

**అధికారి వేధింపులతోనే..**

శానిటేషన్ విభాగంలోని హెల్త్‌అసిస్టెంట్ కిరణ్ తనను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని కార్మికుడు విజయ్‌కుమార్ ఆరోపించాడు. ఆరేళ్లుగా చెత్త సేకరించే ఆటోట్రాలీపై డ్రైవర్‌గా పని చేస్తున్నానని, డ్రైవర్‌కు ఇవ్వాల్సిన కేటగిరీ జీతం ఇవ్వడం లేదని, మిగతా డ్రైవర్లకు ఎక్కువ జీతం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు కేటాయించిన ఆటో ట్రాలీని వేరే వ్యక్తికి ఇస్తున్నారని, తనను ఇతర పనులు చేయాలని వేధిస్తున్నారని ఆరోపించాడు. మానసిక వేధింపులతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపాడు. కాగా, కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోకుంటే ఊపేక్షించబోమని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వై.యాకయ్య, మురళీధర్‌రావు హెచ్చరించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### మద్యానికి బానిసై బలవన్మరణం



బియ్యాల ప్రశాంత్ (ఫైల్)

రామగుండం: కుటుంబ కలహాలతో మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం లింగాపూర్‌లో చోటుచేసుకుంది. అంతర్గాం ఎస్సై వెంకటస్వామి కథనం ప్రకారం.. లింగాపూర్ గ్రామానికి చెందిన బియ్యాల చంద్రయ్య–శారద దంపతుల కుమారుడు ప్రశాంత్‌కు వెల్గటూర్ మండలానికి చెందిన సంధ్యతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప జన్మించింది. ప్రస్తుతం సంధ్య గర్భిణి. అయితే, కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో సంధ్య ఇటీవల పుట్టింటికి వెళ్లింది. తీవ్ర మనస్థాపానికి గురైన ప్రశాంత్ మద్యానికి బానిసయ్యాడు. తరచూ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### గోదాం వద్ద హమాలీ మృతి



నీతుకుమార్‌సదా(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గొల్లపల్లి సమీపంలోని ఓ గోదాంలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన నీతుకుమార్‌సదా(22) అనే హమాలీ మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం.. నీతుకుమార్‌సదా మూడు నెలల క్రితం గోదాంలో పని చేసేందుకు వచ్చాడు. బుధవారం రాత్రి తన గదిలో ఉక్కపోతగా ఉండడంతో సమీపంలో పార్కింగ్ చేసిన లారీపై నిద్రపోయాడు. నిద్రమత్తులో ప్రమాదవశాత్తు కింద పడ గా తలకు తీవ్రగాయమైంది. తోటి హమాలీలు సుల్తానాబాద్ ఆస్పత్రి, అక్కడి నుంచి కరీంనగర్, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడి తండ్రి త్రిభువన్‌సదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# అవ్వా.. నీకు నేనున్నా

- వృద్ధురాలికి భరోసా కల్పించిన సీఐ సదన్ కుమార్



మల్లమ్మతో మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్

మానకొండూర్‌రూరల్: కొడుకులను పెంచి పెద్ద చే సి ప్రయోజకులను చేసిన తల్లిని నిర్దాక్షిణంగా ఇంటి నుంచి వెళ్లగొట్టారు. సంపాదించిన ఆస్తిపాస్తులు, స ర్వం అప్పజెబితే తిండి పెట్టకపోవడంతో బిక్కుబిక్కుమంటూ ఇంటి ముందు దీనావస్థలో ఉండగా పో లీసులకు గ్రామస్తులు సమాచారం అందించారు. సీఐ సదన్‌కుమార్ గురువారం ఆమె ఇంటికి వె ళ్లి పరామర్శించారు. 'అవ్వా.. నీకు నేనున్నా' అంటూ భరోసా కల్పించారు. వివరాలు.. వెల్దికి చెందిన వద్లూరి మల్లమ్మకు కిష్టయ్య, కిరణ్ సంతానం. భర్త కనకయ్య సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యా క అనారోగ్యంతో మృతిచెందాడు. 2 ఎకరాల భూ మి, రెండు ఇళ్లను కుమారులకు సమానంగా పంచింది. అన్నదమ్ములు వంతులవారీగా తల్లిని సాకుతున్నారు. ఈక్రమంలో ఇటీవల అన్నదమ్ములు గొ డవపెట్టుకుని తల్లి పోషణను పట్టించుకోక, ఇంటి నుంచి వెళ్లగొట్టడంతో ఒంటరయింది. కొద్దిరోజుల నుంచి తిండి లేక పస్తులుండగా పోలీసులకు సమాచారం అందింది. సీఐ గ్రామానికి చేరుకుని 'నీ బాగోగులు నేను చూసుకుంటా' అని వృద్ధురాలికి భరోసా కల్పించారు. భర్త ఫొటోను కుమారులు బయట పడేశారని వృద్ధురాలు వివరించగా, చలించిన సీఐ ఫొటోను తెప్పించి ఇంటి గోడకు పెట్టించడంతో ఆమె కళ్లలో ఆనందంతో నీళ్లు వచ్చాయి. కుమారుల పరిస్థితిలో మార్పు రాకుంటే సీనియర్ సిటిజన్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే సమాచారం అందించాలని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈసందర్భంగా సీఐని గ్రామస్తులు అభినందించారు.

### సమాజాభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలి

రామడుగు(చొప్పదండి): ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తే దేశాభివృద్ధి సాధ్యమని వెలిచాల గ్రామానికి చెందిన ట్రైనీ ఐఏఎస్ నందాల సాయికిరణ్ అన్నారు. రామడుగు మండలం వెలిచాల శ్రీసరస్వతి పాఠశాలలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని జీవితంలో పైస్థాయి ఎదగాలని సూచించారు. ఈసందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌ను పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్, కో కరస్పాండెంట్ సత్యం, మాజీ సర్పంచులు వీర్ల సరోజన, రవీందర్‌రావు, కాడె శంకర్, పెద్దిగారి ఎల్లయ్య, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ బండపెల్లి యాదగిరి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు శుక్రుద్దీన్, సుదర్శన్, పర్శారామ్, వంగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రేమలో పడిందని చెల్లిపై దాడి

మెట్‌పల్లిరూరల్: తోడబుట్టిన చెల్లి ఓ యువకుడిని ప్రేమిస్తోందనే కారణంతో సోదరుడు ఆమెపై దాడికి పాల్పడిన ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రాంతంలో చర్చనీయాంశమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన బోదాసు రాజ్‌కుమార్, మానస అన్నాచెల్లెళ్లు. ఇద్దరూ ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట శివారులోని టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోలార్, బ్యాంకింగ్ ఫైనాన్స్ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నారు. గురువారం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న అన్నాచెల్లెళ్లు ఇంటికి వెళ్తున్న సమయంలో మానస ప్రేమ వ్యవహారం చర్చకు వచ్చింది. తీరు మార్చుకోవాలని చెల్లెకు రాజు సూచించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటమాట పెరగడంతో మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులోని వరదకాలువ వద్దకు తీసుకెళ్లాడు. ఆమెపై విచక్షణరహితంగా కర్రతో దాడికి పాల్పడ్డాడు. అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న ఆమెను చూసిన స్థానికులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు మానసను మెట్‌పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.